


సంజామలలో వేసిన మిరప పంట

మిరప రైతుకు కన్నీరు...!

- వర్షాభావంతో తెగుళ్ల బారిన పడిన పంట
- భారీగా తగ్గిన దిగుబడులు
- నష్టాల్లో మిరప రైతు

నంద్యాల (ఆంధ్రజ్యోతి)/ సంజామల, ఫిబ్రవరి 22:
వానలు సక్రమంగా కురుస్తాయి.. తమ కష్టాలు తీరుతాయి.. అనుకున్న మిరప రైతులకు ఈ ఏడు నష్టాలు తప్పడం లేదు. వర్షాలు ముఖం చాటేయడానికి తోడు వైసీపీ ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో ఎస్సార్బీసీకి నీరు సరిగా అందలేదు. దీంతో అనుకున్న దిగుబడి రాలేదు. ఎరువులు, క్రిమి సంహారక మందులకు లక్షల రూపాయలు వెచ్చించినా ఫలితం కనపడేలా లేదు. ఇన్నాళ్లు సొంత బిడ్డల్లా సాకిన మిరప చేలు ఎండు ముఖం పడుతుండటంతో కనీసం పెట్టిన పెట్టుబడి అయినా తిరిగి వస్తుందా అన్న ఆందోళన రైతులను పట్టి పీడిస్తోంది. పంట నష్టం కింద ప్రభుత్వం తమకు పరిహారం అందించకపోతే గట్టెక్కే పరిస్థితి లేదని, ప్రభుత్వం దయతలిచి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వర్షాభావం.. పైగా తెగుళ్లు



సంజామల మండలంలో దాదాపు 1200 ఎకరాల్లో రైతులు మిరప సాగు చేశారు. ఇందులో సూపర్ టెన్, బ్యాడ్ గీ, సిక్స్ ఇంటు సెవెన్, నంబర్ 5 కుబేర వంటి రకాలకు చెందిన పంటను వేశారు. మిరప మొక్కగా ఉన్నప్పటి నుంచి చాలా జాగ్రత్తగా పెంచాలి. కొంచెం అజాగ్రత్త చేసినా మొక్కలు ఎండిపోయే పరిస్థితి ఉంటుంది. ఎండ ఎక్కువ తగిలినా, నీళ్ల ఎక్కువ అయినా, తక్కువ అయినా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. దీనికి తోడు మిరప పంటకు చీడపీడల ప్రమాదం కూడా ఎక్కువే. అలాంటిది ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావం ఏర్పడటంతో మిరప రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక ప్రభుత్వం ఎస్సార్బీసీకి నీటిని అడపాదపా విడుదల చేసినా అవి పంటలను కాపాడుకోవడానికి ఉపయోగపడలేదు. దీంతో చాలా ఎకరాల్లో పంట నష్టపోయింది. నీటి వసతి ఉన్న కొద్ది మంది రైతులు ఎలాగోలా తమ పంటను కాపాడే ప్రయత్నం చేసుకున్నారు. అయితే నల్లి, బింగి వంటి తెగుళ్ల మిరప పంటను పట్టి పీడించడం మొదలు పెట్టాయి. ఇలా అన్ని వైపుల నుంచి ఇబ్బందులు ఎదురవడంతో మిరప రైతులు ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. దీంతో పూర్తిగా దిగుబడి తగ్గిపోయింది. తమ కష్టం కన్నీటి పాలయిందని కుమిలిపోతున్నారు.

ఎకరాకు రూ.1.20 లక్షల ఖర్చు..

మిరప పంటకు మొదటి రోజు నుంచి ఖర్చు విపరీతంగా ఉంటుంది. ఏరోజుకారోజు కలుపు తీయకపోతే మొక్క ఎదిగే పరిస్థితి ఉండదు. పెరిగిన క్రిమిసంహారక మందుల వల్ల మిరపకు వచ్చే తెగుళ్ల అదుపులోకి రావడం లేదు. దీంతో వారంలో రెండుసార్లు క్రిమిసంహారక మందులు వాడాల్సిందే! ఇక ఎరువుల వాడకం సరేసరి. దీనికి తోడు పెరిగిన కూలీ ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. ఇలా అన్ని విధాల ఖర్చులు కలిపి మిరప సాగుకు ఎకరాకు రూ.1.20 లక్షల ఖర్చు వస్తోంది. అయితే గతంలో ఎకరాకు మిరప దిగుబడి 20 నుంచి 30 క్వింటాళ్లు వచ్చేది కాబట్టి ఈ స్థాయి ఖర్చు పెట్టినా రైతుకు లాభం ఉండేది. అయితే ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతన్నలు చెబుతున్నారు. ఈ దిగుబడితో తమకు మిగిలేది లేకపోగా నాలుగైదు రూ.లక్షలు అప్పుల పాలయ్యే పరిస్థితి దాపురించిందని ఆవేదన చెందుతున్నారు.


ఎస్సార్బీసీ ప్రవహించకపోవడంతో ట్రాక్టర్ ద్వారా నీరు పారిస్తున్న దృశ్యం

ఐదు ఎకరాలలో మిరప పంటను సాగు చేశా



నా పేరు వెంకటేశ్వరరెడ్డి. మాది సంజామల. నేను 5 ఎకరాలలో బ్యాడ్ గీ, సిక్స్ ఇంటు సెవెన్ వంటి రకాల మిరపను సాగు చేశాను. నాట్లు వేసినప్పటి నుంచి వర్షాలు కురువలేదు. దీనికి తోడు పంటకు తెగులు సోకింది. దీంతో దిగుబడి భారీగా తగ్గింది. ఇప్పటి వరకు రూ.6 లక్షలు పెట్టుబడి పెట్టాను. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే అవకాశాలు కనిపించడం లేదు.

-తోట వెంకటేశ్వర రెడ్డి, రైతు, సంజామల

ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది



నా పేరు శేఖర్, మాది సంజామల మండలం ముచ్చలపురి గ్రామం. రెండు ఎకరాలలో బ్యాడ్‌గీ రకం మిరప సాగు చేశాను. ఎకరానికి రూ.లక్షకు పైగా పెట్టుబడి అయింది. సాధారణంగా వర్షాలు బాగా ఉంటే ఎకరానికి దిగుబడి 20 క్వింటాలుకు పైనే వచ్చేది. వర్షాభావ పరిస్థితులు ఉండటంతో పంట దిగుబడి ఎకరానికి 10 నుండి 12 క్వింటాలు మాత్రమే దక్కింది. ఇదే చేసి కష్టానికి, పెట్టిన పెట్టుబడికి ఏమాత్రం సరిపోదు. ఓ సంవత్సరం కష్టం వృథా అయినట్లే!

-శేఖర్, రైతు, ముచ్చలపురి

కౌలు రైతుకు కష్టమే

నా పేరు మస్తాన్. మాది సంజామల మండలం ముచ్చలపురి. నేను కౌలు రైతును. ఎకరా రూ.60 వేలు పెట్టి కౌలుకు తీసుకున్నాను. బ్యాడ్‌గీ రకం మిరప పంటను వేశాను. ఎకరాకు దాదాపు రూ.2.50 లక్షల ఖర్చు వచ్చింది. దిగుబడి 10 నుంచి 12 క్వింటాళ్ళు మాత్రమే వచ్చింది. ఈ స్థాయి దిగుబడితో పెట్టిన పెట్టుబడి రాకపోగా, అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. ప్రకృతి సహకరించకపోవడం ఒక ఎత్తయితే కనీసం ప్రభుత్వం నుంచి సాయం కూడా లేకపోవడంతో కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

- మస్తాన్, ముచ్చలపురి

కౌలు రైతులను పట్టించుకోరా..?

అధికారులు తాము కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందిస్తున్నామని, వారికి కావాల్సిన రుణాలు అందిస్తున్నామని గొప్పలు చెబుతారు. అయితే ఏటికేడు కౌలు రైతులకు అందించే సాయం పడిపోతుందే తప్ప పెరగడం లేదు. సంజామల మండలం కౌలు రైతులు, ప్రత్యేకించి మిరప రైతులు తమకు సీసీఆర్‌సీ కార్డులు తప్పకుండా అందజేయాలని కోరుతున్నారు. అప్పుడే వారికి పంట పెట్టుబడి నుంచి పంట నష్ట పరిహారం వరకు ప్రభుత్వం నుంచి సాయం అందుతుంది. కౌలు రైతులు ఇబ్బంది పడకూడదంటే.. వారికి కౌలు కార్డులు వచ్చేలా చూసేందుకు అధికారులు భూ యజమానులకు సరైన అవగాహన కల్పించాలి. బ్యాంకుల నుంచి సక్రమంగా రుణాలు వచ్చేలా చూడాలి. లేకపోతే ప్రస్తుత సంవత్సరం లాంటి పరిస్థితులు మరో రెండేళ్ల ఏర్పడి, ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోతే ఇక్కడ కౌలు రైతులు కనుమరుగైపోతారనే అభిప్రాయం వినిపిస్తోంది.

కౌలు రైతుకు కష్టం..

సంప్రదాయక వ్యవసాయం నుంచి వాణిజ్య పంటల వైపు మొగ్గిన రైతులకు మళ్లీ వెనక్కి వెళ్లడానికి ఇష్టపడరు. కష్టమో, నష్టమో వాణిజ్య పంటలనే వేస్తుంటారు. ఒక ఏడాది పంట సమృద్ధిగా చేతికి వస్తే అప్పులన్నీ తీరిపోయి, రెండు మూడేళ్ల పెట్టుబడికి సరిపోయే ఆదాయం వస్తుందన్న ధీమాతో ఉంటారు. మిరప లాంటి పంటలో ఈ లాభం ఎక్కువగా ఉంటుందన్న ఆలోచనతో మిరప రైతులు ఇదే ఆశతో ప్రతి ఏడు ఈ పంటనే వేసేందుకు ఇష్టపడతారు. సంజామల మండలం మిరప కౌలు రైతులు పరిస్థితి మరీ ఘోరం. మిగతా మండలాల్లో ఎకరా కౌలు రూ.20 వేల నుంచి రూ.30 వేల మధ్యలో ఉంటే, సంజామలలో ఎకరా కౌలు రూ.60 వేల పైనే. ఈ లెక్కన ఎకరా మిరప పంట సాగుకు ఖర్చు దాదాపు రూ.2 లక్షలు వస్తుందని అంచనా. ఇంత ఖర్చు పెట్టిన కౌలు రైతులకు ఈ ఏడాది దిగుబడి సరిగా రాకపోవడంతో ఏం చేయాలో పాలుపోని స్థితి. వర్షాలు సరిగా పడలేదు కాబట్టి భూ యజమానులు కౌలు ఏమైనా తగ్గిస్తారా అంటే అదీ ఉండదు. ఎస్సార్బీసీ కాలువ కింది కౌలు రైతులు పరిస్థితి కూడా ఇంతకంటే భిన్నంగా ఏమీ లేదు. వర్షం పడకపోయినా, కాలువకు నీళ్లు వస్తాయనుకుంటే ప్రభుత్వం కనీసం పట్టించుకోకుండా తమ పంటలను ఎండబెట్టిందని, పైగా తమలో చాలా మంది కౌలు కార్డులు కూడా అందించకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం పొందే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి ఈ ఏడు మిరప పంటను వేసి తాము అప్పుల ఊబిలో కూరుకుపోయామని, ఈ అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీగిరిపై వైద్యశాల

- ధర్మకర్తల మండలి ఆమోదం
- అంచనా వ్యయం రూ.19 కోట్లు
- తిరుమల తరహాలో స్వయంప్రతిపత్తికి ప్రతిపాదన


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, ఈవో

శ్రీశైలం, ఫిబ్రవరి 22: శ్రీశైలం దేవస్థానంలో భక్తులు, స్థానికుల సౌకర్యార్థం రూ.19 కోట్లతో 30 పడకల వైద్యశాల నిర్మించాలని ధర్మకర్తల మండలి తీర్మానం చేసింది. ఆలయ కార్యాలయ భవనంలోని సమావేశ మందిరంలో గురువారం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఉప కార్యనిర్వహణాధికారి రవణమ్మ, వివిధ విభాగాల యూనిట్ అధికారులు పాల్గొన్నారు. ఇటీవల మరణించిన దేవస్థానం వేదపండితుడు జగన్నాథశర్మకు ఈ సమావేశం సంతాపం ప్రకటించింది. ఈ సమావేశంలో 50 అంశాలను ప్రవేశపెట్టగా వాటిలో 49 అంశాలకు ఆమోదం తెలిపి ఒక అంశాన్ని వాయిదా వేశారు. సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైలం దేవస్థానానికి కూడా స్వయం ప్రతిపత్తి కల్పించాలని దేవదాయ శాఖ ప్రతిపాదన పంపాలని తీర్మానించినట్లు తెలిపారు. శ్రీశైలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను దృష్టిలో ఉంచుకుని సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్.ఈ) పోస్టు ఏర్పాటుకు దేవదాయశాఖకు ప్రతిపాదన పంపనున్నట్లు తెలిపారు. దేవస్థానంలో నూతనంగా క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కర్నూలు నగరంలోని దేవస్థానం సమాచార కేంద్రం వద్ద రూ.4.99 కోట్లతో కల్యాణ మండపం, రూ.3.70 కోట్లతో వాణిజ్య సముదాయం, నిర్మాణానికి తీర్మానం చేశామన్నారు. సుండిపెంటలో నిర్మిస్తున్న సిబ్బంది వసతి గృహాలకు రూ. 15 కోట్లతో నీటి సరఫరా ఏర్పాటు తదితర వాటికి ఆమోదం తెలిపామన్నారు.

కౌలు రైతులకు రుణాలు ఇవ్వండి

- ఖరీఫ్ పంట రుణాలను రీ షెడ్యూల్ చేయండి
- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ కె. శ్రీనివాసులు


సమావేశంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్, అధికారులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 22: వ్యవసాయం, పాడి పరిశ్రమ ఇతర ఉపాధి రంగాలపై ఆధారపడిన అర్హులందరికీ పెద్ద ఎత్తున రుణాలు ఇవ్వాలని కలెక్టర్ డా. కె . శ్రీనివాసులు బ్యాంకర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు అధ్యక్షతన జిల్లా బ్యాంకర్ల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సంబంధిత బ్యాంకు మేనేజర్లు, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ రవీంద్రకుమార్, డీఆర్డీఏ పీడీ, వ్యవసాయ, పాడి పరిశ్రమ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో సి.సి కార్డులు మంజూరు చేసిన 22,740 మంది కౌలు రైతులకు విరివిరిగా రుణాలు అందించాలని బ్యాంకర్లను సూచించారు. కరువు మండలాలుగా ప్రకటించిన పాణ్యం, బనగానపల్లె, గడివేముల, మిడుతూరు, పగిడ్యాల, బేతంచర్ల మండలాల్లో ఖరీఫ్‌లో తీసుకున్న పంట రణాలను ఆర్‌బిఐ మేరకు రీషెడ్యూల్ చేయాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. ఈనెల 26 నుంచి మార్చి 1 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నేపథ్యంలో బ్యాంకర్లు తమ పరిధిలోని ఖాతాదారుల్లో అవగాహన క్యాంపులు నిర్వహిం చాలన్నారు. లీడ్ మేనేజర్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో వార్షిక రుణ ప్రణాళిక అమలులో డిసెంబర్ 31 నాటికి 93 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. ఈ సమావేశంలో అన్ని బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు, అన్ని సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచాలి

ఎస్పీ రఘువీర్‌రెడ్డి


ప్యాపిలి పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

ప్యాపిలి, ఫిబ్రవరి 22: ఎన్నికలు సమీపిస్తున్నందున సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ రఘువీర్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని పోలీసు సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించి ఇరువర్గాలతో మాట్లాడి ఎటువంటి సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళలకు రక్షణ కల్పించేలా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి పెట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకోవలసి వస్తుందని ఎస్పీ హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చూడాలన్నారు. నాటు సారా అమ్మకాలను నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ సుధాకర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన మార్కెట్ సూపర్‌వైజర్

- వ్యాపారి నుంచి రూ.15 వేలు డిమాండ్
- లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో లంచం తీసుకుంటూ పట్టుబడిన సూపర్‌వైజర్ మహేశ్వరితో ఏసీబీ అధికారులు

ఎమ్మిగనూరు/టౌన్, ఫిబ్రవరి 22: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో గురువారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. కూరగాయల వ్యాపారి నుంచి మార్కెట్ సూపర్‌వైజర్ మహేశ్వరి రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెగా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన మూడో వార్డు వైసీపీ కౌన్సిలర్ స్వాతి భర్త వినయ్ అనే వ్యాపారి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఫ్రూట్స్, విజిటబుల్స్ హోల్‌సేల్ వ్యాపారం చేసుకునేందుకు ట్రేడ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. నిబంధనల ప్రకారం లైసెన్స్ ఫీజు రూ.5 వేలు చెల్లించినప్పటికీ రూ.15 వేలు లంచం ఇస్తేనే ట్రేడ్ లైసెన్స్ ఇస్తానని సూపర్ వైజర్ తెలిపింది. అయితే అంత మొత్తం ఇచ్చేందుకు ఇష్టం లేని సదరు వ్యాపారి వినయ్ బుధవారం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో వారు వివరాలను పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. గురువారం మధ్యాహ్నం మార్కెట్ కమిటీ కార్యాలయంలో వినయ్ నుంచి సూపర్ వైజర్ మహేశ్వరి రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా అప్పటికే అక్కడ వేచి ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. లంచం డబ్బును స్వాధీనం చేసుకొని సూపర్‌వైజర్ మహేశ్వరిని అదుపులోకి తీసుకున్నారు. కాగా మార్కెట్‌లో ఏసీబీ అధికారులు దాడులు చేయటం కలకలం రేపింది.

'అనంత'లో కదం తొక్కిన జర్నలిస్టులు

- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో 'చలో అనంతపురం'
- కర్నూలు జిల్లా నుంచి భారీగా తరలివెళ్లిన నాయకులు


అనంతపురం కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న కర్నూలు జిల్లా నాయకులు


ధర్నాలో బైఠాయించిన జర్నలిస్టులు


అనంతపురం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు

అనంతపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడి, ఇతర ప్రాంతాల్లో జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై వైసీపీ దాడులను ఖండిస్తూ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర శాఖ గురువారం 'చలో అనంతపురం' కార్యక్రమాన్ని చేపట్టింది. అనంతపురం నగరంలోని సంగమేశ్వర సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు జర్నలిస్టు సంఘాల నాయకులు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్‌కు స్పందించే తీరిక కూడా లేదా అని ఆ సంఘం నాయకులు ప్రశ్నించారు. సాక్షాత్తు సీఎం జగన్ సిద్ధం సభలోనే ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు విచక్షణా రహితంగా దాడి చేసి, చంపేందుకు ప్రయత్నించిన సంఘటనను ప్రజాస్వామిక వాదులందరూ ఖండించారని అన్నారు. అయినా ముఖ్యమంత్రిగాని, డీజీపీగాని ఇప్పటి దాకా నోరుమెదపకపోవడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికైనా జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై దాడులను నియంత్రించకపోతే 'చలో అనంతపురం'తో ఆగమని, తాడేపల్లి ప్యాలెస్‌ను ముట్టడిస్తామని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు హెచ్చరించారు. ఈ నిరసనకు కర్నూలు, నంద్యాల జిల్లా నుంచి పెద్ద ఎత్తున జర్నలిస్టులు తరలివచ్చారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే, ఐజేయూ నాయకులు అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఐజేయూ జాతీయ ప్రధాన కార్యదర్శి సోమసుందర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కె. నాగరాజు, జి.కొండప్ప, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈఎన్ రాజు, శ్రీనివాస్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరి సుంకన్న, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అంజి, వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు స్నేహాల్ కార్యదర్శి కిరణ్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు శివ, అవినాశ్, కోసి హనుమేష్, పత్తికొండ రాజేశ్, మద్దికెర వీరశేఖర్, ఎమ్మిగనూరు నూర్, ఎమ్మిగనూరు తాలూకా అధ్యక్షుడు శ్రీనివాస నాయుడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, పట్టణాధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు



జర్నలిస్టుల రక్షణ కోసం ఒక ప్రత్యేక చట్టం తేవాలి



రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి జగన్ నాయకత్వంలో జరిగిందనేది స్పష్టంగా అర్థమవుతోంది. ఆ సభలో ఆయన ఆ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతోనే ఈ దుర్మార్గమైన చర్యకు పాల్పడ్డారు. దాడి వీడియో చూస్తుంటే ప్రతిఒక్కరూ బాధపడ్డారు. ఐదేళ్లలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులపై దాడులు ఎక్కువయ్యాయి. ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. గత ప్రభుత్వాల్లో ఎప్పుడూ జర్నలిస్టులపై దాడులు జరగలేదు. జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో సిద్ధం సభ పెట్టి వారి మనుషులతో శ్రీకృష్ణను కిరాతకంగా కొట్టించారు. ఘటన జరిగిన ఐదు రోజులు గడుస్తున్నా జిల్లా పోలీసు యంత్రాంగం ఒక్కరినే అరెస్టు చేయడం చూస్తుంటే... వీరి వెనుక అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది. వెంటనే జిల్లా ఎస్పీ ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించి దాడికి పాల్పడిన ప్రతిఒక్కరిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకు రావాలి.

- రాజు, ఏపీయూడబ్ల్యూజే కర్నూలు జిల్లా అధ్యక్షుడు

జనన, మరణాలను సకాలంలో నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 22: జనన, మరణాలను సకాలంలో నమోదు చేసుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు రావని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో ధృవీకరణ పత్రాలు పొందడంలో ఎదురయ్యే సమస్యల గురించి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం మరణం, వివాహం, ఆదాయం, కులధృవీకరణ పత్రాలను పొందడం గురించి సంబంధిత అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు, పారా లీగల్ వలంటీర్లు, ప్రసూన న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం సరిహద్దులు దాటరాదు

బళ్లారిలో అంతర్రాష్ట్ర ఎక్సైజ్ సమీక్ష

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 22: మద్యాన్ని సరిహద్దులు దాటకుండా ఉమ్మడి కార్యాచరణతో పని చేయాలని హోస్పేట్ ఎక్సైజ్ కమిషనర్ శైలజ అన్నారు. గురువారం కర్నాటకలోని బళ్లారిలో ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో కర్నాటక, రాష్ట్ర సరిహద్దులోని కర్నూలు, అనంతపురం జిల్లాల ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్లు, సూపరింటెండెంట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మద్యం రవాణా ఎక్కడ నుంచి జరుగుతుంది? ఎలా నిరోధించాలనే అంశాలపై చర్చించారు. ఉమ్మడిగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఇరు రాష్ట్రాల సిబ్బంది అందులో ఉంటూ ఎన్నికల సమయాన మద్యం రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. రెండు జిల్లాల్లో నాలుగు చెక్‌పోస్టులు ఉండగా రాయదుర్గం, అలూరు, ఆదోని, కోసిగిల్లో ప్రత్యేక సిబ్బందిని నియమించేందుకు ఇరు రాష్ట్రాల అధికారులు ఒక ఒప్పందానికి వచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి ఎక్సైజ్ కమిషనర్ వివేక్‌యాదవ్, సూపరింటెండెంట్ ఎం. సుధీర్ బాబు, సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించండి

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: జిల్లాలో ఇంటర్మీడియట్, పదో తరగతి, డీఎస్సీ టెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం పదో తరగతి, ఇంటర్మీడియట్, టెట్, డీఎస్సీ పరీక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యాశాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీలు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కర్నూలు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరియం నుండి కలెక్టర్ డా.జి. సృజన, ఎస్పీ కృష్ణకాంత్ పాల్గొన్నారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి విద్యాశాఖ అధికారి శ్యాముల్, ఆర్ఐవో గురువయ్యశెట్టి, డీవీఈవో జమీర్ పాషా, ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించామని, మళ్లీ అనుబంధ శాఖలతో కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించి జిల్లాలో పరీక్షలను విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ పరీక్షలు నిర్వహించే సమయంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

విజయవాడలో డీసీసీ అధ్యక్షుడి అరెస్టు


నరసింహను బలవంతంగా స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 22 : విజయవాడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఛలో సెక్రటేరియేట్‌ను భగ్నం చేసేందుకు అక్కడి పోలీసులు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేశారు. ఛలో సెక్రటేరియేట్‌కు వెళ్లిన నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జె. లక్ష్మీనరసింహ యాదవ్‌ను అరెస్టు చేశారు. గురువారం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నేతృత్వంలో ఛలో సెక్రటేరియేట్‌ను అడ్డుకునేందుకు ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులను బలవంతంగా అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించింది. ఈ ముట్టడిలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహను బలవంతంగా స్పెషల్ పార్టీ పోలీసులు అరెస్టు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 52 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తే ఆయన వారసుడిగా చెప్పుకునే జగన్ కేవలం 6 వేల పోస్టులతో ఇచ్చిన నోటిఫికేషన్ దగా డీఎస్సీ అని నరసింహ ధ్వజమెత్తారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని దగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని ఆయన అన్నారు. టెట్, డీఎస్సీ కలిపి నోటిఫికేషన్ ఇస్తే అభ్యర్థులు దేనికి సన్నద్ధం కావాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హుసేన్‌బాషా, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షంషుల్‌హక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలు యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగన్ ప్రేరేపిత ఉగ్రవాదం


మాట్లాడుతున్న బీటీ నాయుడు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 22: రాష్ట్రంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదం నడుస్తోందని జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, పాణ్యం నియోజకవర్గం ఇన్‌చార్జి గౌరు చరితారెడ్డితో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా బీటీ నాయుడు మాట్లాడుతూ ఈనాడు కార్యాలయంపై దాడి జరిగిన వెంటనే కాటసాని తాడేపల్లి నుంచి పిలుపు అందుకొని పరుగులు తీసి అక్కడ అక్షింతలు వేయించుకున్నారని అన్నారు. తన అవినీతి ఆరోపణలు కప్పిపుచ్చుకునేందుకు తాడేపల్లిలో తనకూ ఈనాడు మీద దాడికి ఎలాంటి సంబంధం లేదని కాటసాని చెప్పడం సిగ్గుచేటన్నారు. తాను అక్రమాలు, భూదందాలు చేయలేదనే దానిపై బహిరంగ చర్చకుకాటసాని రాంభూపాల్‌రెడ్డి సిద్ధమా? అని గౌరు చరితారెడ్డి సవాలు విసిరారు. కాటసాని అక్రమాలపై వచ్చిన వార్తలపై ఖండించుకోలేక నగరం నడిబొడ్డున ఉన్న ఈనాడు కార్యాలయంపై కాటసాని అనుచరులు, వైసీపీ మూకలు దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఈ దాడికి కాటసాని తన అనుచరులను ప్రోత్సహించిన మాట వాస్తవం కాదా? అని అన్నారు. ఆయన అవినీతి గురించి తమ వద్ద అన్ని ఆధారాలున్నాయని, అవసరమైతే ఆయన ఇంటికి వెళ్లి చర్చించేందుకు తాము సిద్ధమని అన్నారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ కాటసాని అక్రమాల గురించి ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో ఏ చిన్న పిల్లవాడిని అడినా చెబుతారని అన్నారు. తెలుగుదేశం పార్టీలో చేరిన వారిని వేధిస్తున్నారని అన్నారు. మీడియాపై దాడులకు ప్రోత్సహిస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఏ-1గా, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీదేవిలను ఏ2, ఏ3గా 307 కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభాకర్ యాదవ్, మాదేసు, సుధాకర్‌రెడ్డి, జేమ్స్, పాల్గొన్నారు.

రైతుల జీవితాలతో చెలగాటం వద్దు


మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

- సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 22 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జస్టిస్ స్వామినాథన్‌కు భారతరత్న అవార్డు ఇస్తూ మరో వైపు స్వామినాథన్ కమిషన్ రిపోర్టు అమలు కోసం పోరాడుతున్న రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం నంద్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో బొజ్జా మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ రిపోర్టులోని కీలకమైన వ్యవసాయ ఉత్పాదనలకు కనీస మద్దతు ధర కల్పిస్తామని 2014 ఎన్నికల ప్రణాళికలో బీజేపీ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. కనీస మద్దతు ధర అమలు చేస్తామని ప్రకటించి పదేళ్లు అయినా హామీని బీజేపీ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. కేంద్ర వైఖరిని ప్రశ్నిస్తున్న రైతులపై దాడులకు దిగడం దారుణమని అన్నారు. యావత్ భారత దేశ రైతుల హక్కుల కోసం పోరాడుతున్న పంజాబ్ రైతులపై పోలీసు బలగాలతో కేంద్ర ప్రభుత్వం దాడులు చేయించడం, అందులో యువ రైతు మరణించడం బాధాకరమని అన్నారు. రైతాంగ హక్కుల కోసం పోరాటంలో చనిపోయిన రైతుకు నివాళులర్పిస్తున్నామని అన్నారు. రైతులపై దాడులు ఆపి రైతుల న్యాయమైన వ్యవసాయ ఉత్పాదనలకు కనీస మద్దతు ధర కల్పించేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సాగునీటి సాధన సమితి ప్రతినిధులు న్యాయవాది కృష్ణారెడ్డి, నందిగం హుసేనయ్య, సౌదాగర్ కాశీమియ్య, నెట్టూరి సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి గురు వైభవోత్సవాలు

12న రాఘవేంద్రస్వామి పట్టాభిషేకం



మంత్రాలయం, ఫిబ్రవరి 22: మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాలు మార్చి 11 నుంచి 16వ తేదీ వరకు ఆరు రోజులు వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి తెలిపారు. గురువారం మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆశీస్సులతో 403వ రాఘవేంద్రస్వామి పట్టాభిషేకం, 429వ రాఘవేంద్రస్వామి పుట్టినరోజు వేడుకల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 12న రాఘవేంద్రస్వామి 403వ పట్టాభిషేక మహోత్సవం, 16వ తేదీన రాఘవేంద్రస్వామి 429 జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆరు రోజుల పాటు జరిగే వేడుకల్లో రాఘవేంద్రస్వామి బంగారు పాదుకలను బంగారు సింహాసనంపై ఉంచి ముత్యాలు, బంగారు నాణేలు, పుష్పాలతో అభిషేకం చేయనున్నారు. ఈ వేడుకల్లో భాగంగా బంగారు రథంపై స్వామివారిని ఊరేగించనున్నారు. యోగీంద్ర కళా మండపంలో ప్రముఖులకు గురు వైభోత్సవ అవార్డుల ప్రదానం, భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శన, దాసవాణి ఉంటాయి. మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఉద్యోగం నుంచి ఉపాధ్యాయుడి తొలగింపు

కర్నూలు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చిప్పగిరి మండలం డేగలహాల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో లెక్కల ఉపాధ్యాయుడిగా పని చేసున్న వి.బాలాజీని ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తూ గురువారం ప్రభుత్వం డబ్ల్యూ నెం.8 కింద గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2018 డిసెంబరు 19 నుంచి విధులకు నిరంతరంగా గైర్హాజరు అవుతుండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సంబంధిత ఉత్తర్వులు జిల్లా విద్యాశాఖ అధికారికి పంపించారు.

డోన్‌లో విద్యార్థిని ఆత్మహత్య

డోన్(రూరల్), ఫిబ్రవరి 16: డోన్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. రాత్రిపూట ఇంట్లో సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తుందని తల్లిదండ్రులు మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఉరి వేసుకున్నదని తెలిపారు.



కొత్తపల్లిలోని యునాని వైద్యశాల

మందుల్లేవ్..!

● కొత్తపల్లి యునాని వైద్యశాలలో మందుల కొరత
● ఇబ్బందులు పడుతున్న రోగులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 22: యునాని వైద్యశాలకు వైద్యాధికారి, సిబ్బంది ఉన్నారూ కానీ మందుల కొరత వేధిస్తోంది. దీంతో మండలంలోని యునాని వైద్యశాలలో రోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యునాని వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం మండల కేంద్రమైన కొత్తపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓ చిన్న పాటి గదిలో 15 సంవత్సరాల క్రితం యునాని వైద్యశాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ వైద్యాధికారితో పాటు అటెండరును కూడా నియమించారు. అయితే మందుల కొరత వేధిస్తుండటంతో చేసేదేమీ లేక రోగులు వైద్యశాలకు వచ్చి వెనుదిరిగి వెళ్లిపోతున్నారు ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలకు అవసరమయ్యే కీళ్ల నొప్పులు, ఊపిరితిత్తులు, చర్మ వ్యాధి, మొలలు, జీర్ణకోశ వ్యాధులతో పాటు పలు రకాల వ్యాధులకు సంబంధించిన మందులు లేవు. నిత్యం రోగులు యునాని వైద్యశాలను ఆశ్రయిస్తున్నారు గానీ, మందులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పీహెచ్‌సీలోని ఓ చిన్నపాటి గదిలో యునాని వైద్యశాలను ఏర్పాటు చేయడంతో ఈ ఆసుపత్రికి సంబంధించిన సామగ్రి కూడా పెట్టుకోవడానికి స్థలం లేదు. దీంతో ఉన్న సామగ్రి కూడా పీహెచ్‌సీలోనే కలిపేశారు. ఇక్కడ వైద్యాధికారి, అటెండరు రోజు వస్తున్నారే గానీ, గత కొంత కాలంగా మందులు లేకపోవడం వల్ల చేసేదేమీలేక ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. యునాని వైద్యశాలకు ప్రభుత్వం మందులు పంపిణీ చేయాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.


అరకొర మందులతో ఖళీగా ఉన్న ర్యాకులు

ఉన్నతాధికారులకు తెలియజేశాం


గత కొన్ని నెలలుగా యునాని మందుల కొరత ఉన్న విషయం ఉన్నతాధికారులకు ఇండెంట్ ద్వారా తెలియజేశాం. మండలం నుంచి యునాని వైద్యం కోసం రోగులు వస్తున్నారే గానీ, మందులు లేకకపోవడం వల్ల వెనుదిరిగి పోతున్నారు.
- జమాలుద్దీన్, యునాని వైద్యాధికారి

టీడీపీలో చేరిక


బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 22: ఆత్మకూరు మండలంలోని శ్రీపతిరావుపేట గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు గురువారం శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరారు. వెలుగోడు మండలంలోని వేల్పనూరు గ్రామంలో బుడ్డా స్వగృహంలో ఆయన సమక్షంలో టీడీపీలోకి చేరారు. టీడీపీలో చేరిన వారిలో ఆత్మకూరు మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు సోంపల్లి సుబ్బారావు, వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి అవులపాటి రమేష్, గ్రామ వార్డు సభ్యుడు సోంపల్లి వెంకటేశ్వర్లు, నరేష్, శివశంకర్, సంజిరెడ్డి, వెంకటేశ్వర్లు, అరుణ్, కృష్ణ ఉన్నారు. వీరికి బుడ్డా రాజశేఖరరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బుడ్డా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఉంటుందని భరోసా ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కంచర్ల గోవిందరెడ్డి, శాఖమూరి గిరిరాజు తదితరులు ఉన్నారు.

వెలుగోడు: మండలంలోని తిమ్మనపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. గురువారం వేల్పనూరులో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో వైసీపీ నాయకులు పిచ్చన్న గారి వెంకటేష్, పసుపులేటి రాము, పెద్ద మద్దిలేటి, వెంకటేష్, జయకృష్ణ పిచ్చన్న, శ్రీరాములు తదితరుల ఆధ్వర్యంలో సుమారు 35 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి బుడ్డా రాజశేఖరరెడ్డి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

టీడీపీ నాయకుడి కుటుంబ సభ్యులకు పరామర్శ


దాసు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శివానందరెడ్డి

కొత్తపల్లి, ఫిబ్రవరి 22: మండలంలోని కొక్కెరంచ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గ్రామ టీడీపీ నాయకుడు దాసు కుటుంబ సభ్యులను టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి పరామర్శించారు. గురువారం మాండ్రతో పాటు కొక్కెరంచలోని దాసు కుటుంబ సభ్యులను టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గిట్టా జయసూర్య, పార్టీ మండల కన్వీనర్ నారపురెడ్డి, నాయకులు గిరీష్ రెడ్డి, మాండ్ర సరేంద్రనాథ్ రెడ్డితో కలిసి పరామర్శించారు. అనంతరం మాండ్ర మాట్లాడుతూ దాసు గ్రామంలో చురుకైన నాయకుడుగా పార్టీకి సేవలందించారని ఆయన సేవలను కొనియాడారు. దాసు కుటుంబ సభ్యులకు టీడీపీ అన్ని వేళలా అండగా ఉంటూ సహాయ సహకారాలు ఉంటాయనీ హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు జూనాల సుధాకర్, ఓబుల్ రెడ్డి, జమీల్, రసూల్ తదితరులు ఉన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి


విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు ఫిబ్రవరి 22: మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయసాధన కోసం కృషి చేద్దామని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి కాకరవాడ చిన్నవెంకటస్వామి అన్నారు. గురువారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఆయన విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కాకరవాడ చిన్నవెంకటస్వామి మాట్లాడుతూ భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా ఆయన విద్యావ్యవస్థలో తనదైన ముద్రవేశారన్నారు. విద్యారంగానికి ఆయన చేసినటువంటి సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుల్తాన్, ఖాద్రి, ముజుఫర్ రెహమాన్, బాలు, నరేష్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

'జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం'


వీపనగండ్లలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు ఫిబ్రవరి 22: సీఎం జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య అన్నారు. మిడ్తూరు మండలంలోని వీపనగండ్ల గ్రామంలో గురువారం టీడీపీ నాయకులు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జయసూర్య ఇంటింటి ప్రచారం చేస్తూ మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ ఐదేళ్ల కాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు విసిగిపోయారని, యువతకు ఉద్యోగ అవకాశాలు లేకపోవడం, పెరిగిన నిత్యావసరాల ధరలు, పెంచుతున్న విద్యుత్ చార్జీల మోతలతో ఇబ్బందు లకు గురవుతున్నట్లు ప్రజలు తెలిపారని జయసూర్య చెప్పారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి, క్లస్టర్ ఇన్ చార్జి గుండం రమణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి, రాజు, శంకర్, కరుణాకర్, చెన్నయ్య, మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి


రమణయ్య (ఫైల్)

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 22: జూపాడు బంగ్లా గ్రామానికి చెందిన రమణయ్య(70) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందారు. ఏఎస్ఐ మేరీ జయంతి తెలిపి న వివరాలివి.. ఈనెల 19న తెల్లవారు జామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గుడిసె అంటుకోవడంతో రమణయ్య తీవ్రంగా గాయపడగా కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే కోలుకోలేక మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

'మహిళ మృతికి కారకులను అరెస్టు చేయాలి'


మాట్లాడుతున్న గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జవహర్‌నాయక్

ఆత్మకూరు, ఫిబ్రవరి 22: శిరీషాబాయి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జవహర్‌నాయక్ కోరారు. ఆత్మకూరు అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శిరీషా బాయిని అదనపుకట్నం కోసం అత్తింటివారు వేధింపులకు గురిచేశారన్నారు. శిరీషా బాయిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపిస్తూ న్యాయం చేయాలని ధర్నా చేసిన తల్లిదండ్రులు, బంధువులు, కులసంఘాల నాయకులపై పోలీసులు దాడి చేయడం అమానుషమని అన్నారు. సమావేశంలో సంఘం నాయకులు నాగస్వామినాయక్, రమేష్‌నాయక్, హనుమంతునాయక్, ఈశ్వర్‌నాయక్, మల్లికార్జుననాయక్, ప్రశాంత్ నాయక్, శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.

'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి త్యాగం మరువలేనిది'


నరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న శాస్త్రవేత్తలు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 22: రైతువారి పద్ధతిలో బ్రిటీష్ పాలకులు రైతుల పట్ల వ్యవహరించిన తీరు, విధించిన పలు విధానాలపై పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి త్యాగం మరువలేనిదని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం ఆర్ఏఆర్ఎస్‌లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్ఏ ఆర్ఎస్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రేనాటి సూర్యచంద్రుల సంస్మరణ సభ


రేనాటి సూర్యచంద్రుల సంక్షిప్త చరిత్ర తెలిపే కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 22: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177 వర్ధంతి సందర్భంగా రేనాటి సూర్యచంద్రుల సంస్కరణ సభను గురువారం నంద్యాలలోని వివేకానంద ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. రేనాటి సూర్యచంద్రుల చిత్రపటానికి పూల మాల వేసి జ్యోతి ప్రజ్వల్వన చేసి ప్రముఖులు తమ సందేశాలు వినిపించారు. రేనాటి సూర్యచంద్రుల సంక్షిప్త చరిత్ర తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. భారతదేశ దాస్య శృంఖలాలను ఛేదించేందుకు వీరోచిత పోరాటం గావించిన వీర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, అపర దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారని నంద్యాల ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ వ్యవసాయ శాస్త్రవేత్త డా. రవీంద్రనాథ్, ఏపీ అధికార భాషా సంఘం సభ్యులు తవ్వా వెంకటయ్య, డాక్టర్ గెలివి సహదేవుడు, డాక్టర్ ఉదయ శంకర్, డాక్టర్ రామక్రిష్ణారెడ్డి, డా.దివి హయగ్రీవాచారి, కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, ఉయ్యాలవాడ జడ్‌పిటిసి పుణ్యలక్ష్మీదేవి, ఉమా మహేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

నందికొట్కూరు ఫిబ్రవరి 22: నందికొట్కూరు పట్టణంలో నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ప్రశాంతి, కౌన్సిలర్లు వైసీపీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

దేవస్థానానికి విరాళంగా వంట పాత్రలు


పాత్రలను విరాళంగా అందజేస్తున్న భక్తుడు

శ్రీశైలం, ఫిబ్రవరి 22: హైదరాబాద్‌కు చెందిన వీపీఎస్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ కంపెనీకి చెందిన బి. పర్వతయ్య లడ్డూ తయారీకి వినియోగించే వంట పాత్రలను విరాళంగా అందజేశారు. పాకం గిన్నెలు, బూంది గిన్నెలు, స్టీలు పొయ్యిలు, మిర్చి జారు తదితర వస్తువులను విరాళంగా అందజేశారు. వీటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని దేవస్థానం అధికారులు తెలిపారు.

25 నుంచి జిల్లా స్థాయి చదరంగం పోటీలు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 22: నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి టెక్కెలోని నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణంలో నంద్యాల జిల్లా స్థాయి చదరంగం పోటీలు ఓపెన్ కాటగిరిలో నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.రవికృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీలోపు ఆసక్తి గల క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రముఖ ఎముకల కీళ్ళ శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ ఎస్.రాజశేఖర్‌రెడ్డి సౌజన్యంతో రూ.22 వేల నగదుతో పాటు జ్ఞాపికలు అందచేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9010451585 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

పరీక్షలపై సమీక్ష

● హాజరైన జిల్లా అధికారులు


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న పరీక్షల నిర్వహణకు సంబంధించిన అధికారులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 22: రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్, పదో వతరగతి, డీఎస్సీ, టెట్ పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. గురువారం తాడేపల్లిలోని విద్యాశాఖ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్‌కుమార్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరబ్ గౌర్, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. నంద్యాల కలెక్టర్ చాంబర్ నుంచి కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు, డీఈఓ సుధాకర్‌రెడ్డి, ఆర్ఐవో సునీత తదితరులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఇంటర్, ఎస్ఎస్‌సీ, టెట్, డీఎస్సీ పరీక్షలకు సుమారు 50 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నారని, ఈ నేపథ్యంలో పరీక్షలను పటిష్టంగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్లకు సూచించారు. విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనతో పాటు, ఫర్నిచర్, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం, వైద్య శిబిరం, విద్యుత్ అంతరాయం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటర్, ఎస్ఎస్‌సీ, పరీక్షల నిర్వహణకు ఇటీవలే సమావేశం నిర్వహించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, పరీక్షా కేంద్రాల సమీపాల్లోని జిరాక్స్ సెంటర్ల మూసివేతకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బదోబస్త్‌తో పాటు 144 సెక్షన్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

వేలం పాటలో తగ్గిన ఆదాయం

గడివేముల, ఫిబ్రవరి 22: గడివేముల పంచాయతీ సంతగేటు, బస్టాండు గేటు, పంచాయతీ ఐదు గదుల బాడుగకు గురువారం వేలం పాటలు నిర్వహించగా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆదాయం తగ్గింది. సర్పంచ్ రవణమ్మ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించచారు. సంత గేటుకు రూ.2.6 లక్షలు, బస్టాండు గేటు రూ.1.63 లక్షలు, రెండవ గదికి రూ.40,500, మూడవ గదికి రూ.62,500, నాలుగో గదికి రూ.21 వేలు, ఐదో గదికి రూ.17,500, పంచాయతీ ఖాళీ స్థలానికి రూ.6 వేలు వేలం పాటలు పాడి హెచ్చు పాటదారులు దక్కించుకున్నారని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.59 వేలు ఆదాయం తగ్గిందని ఈవోఆర్డీ అబ్దుల్‌కాలిక్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలచెన్ని, పంచాయతీ కార్యదర్శి తారకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు'

కొత్తపల్లి, ఫిబ్రవరి 22: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే.. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణ్ హెచ్చరించారు. మండలంలోని దుద్యాల గ్రామస్థులతో గురువారం సాయంత్రం ఎస్ఐ హరిప్రసాద్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు దూకుడు స్వభావం తగ్గించాలని హెచ్చరించారు. ముఖ్యంగా గ్రామాల్లో బెల్టుషాపులు, నాటుసారా, పేకాట, గంజాయి తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తూ ఏదైనా సమాచారం సేకరిస్తుంటే.. పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయా రాజకీయ పార్టీలు పంతాలు, పట్టింపులకు వెళ్లకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.

'అనుచిత వ్యాఖ్యలు తగవు'


ప్రజా పోరు యాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 22: ప్రశాంతమైన నంద్యాలలో ప్రజలను రెచ్చకొట్టే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తే శిల్పా ఖబడ్దార్ అని బీజేపీ నంద్యాల కన్వీనర్ అభిరుచి మధు ఘాటుగా హెచ్చరించారు. ప్రజా పోరు యాత్రలో భాగంగా ఆత్మకూరు బస్టాండు మీదుగా గాంధీచౌక్ వద్దకు చేరుకొని ప్రజలు, వ్యాపారులను కలిసి బీజేపీ చేపట్టిన పథకాలు వివరించారు. అభిరుచి మధు మాట్లాడుతూ బ్రిటిష్ వారి మాదిరిగా వ్యాపారం కోసం వచ్చి రాజకీయంగా ఆదరిస్తే ఇండియా, పాకిస్తాన్, మగాడు, మగోడు లేరు అని శిల్పా మోహన్‌రెడ్డి, శిల్పా రవి చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. శిల్పా కుటుంబం దుష్ట పాలనకు రోజు దగ్గర పడ్డాయన్నారు. ప్రజలు అరాచకాలు, అన్యాయాలు, తెలుసుకొని ఓటు అనే ఆయుధంతో సమాధి కట్టడానికి సిద్ధమయ్యారన్నారు. మాట వినని కౌన్సిలర్ల పైనే కేసులు పెట్టేందుకు సిద్ధమయ్యారన్నారు. వైసిపి ప్రభుత్వం అరాచకాలు,అవినీతి, అక్రమాలు, దురాగతాలు, రాష్ట్రానికి జగన్ ప్రమాదకరంగా మారారని అన్నారు.

చెల్లికే న్యాయం చేయలేని సీఎం ప్రజలకు ఏం చేస్తారు?: శబరి


సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

గడివేముల, ఫిబ్రవరి 22: సొంత చెల్లెలు షర్మిలకు న్యాయం చేయలేని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు, రాష్ట్రానికి ఏం న్యాయం చేస్తారని బైరెడ్డి శబరి ప్రశ్నించారు. గురువారం ఆమె దుర్వేసి గ్రామంలో ప్రజలతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని అన్నారు. మద్యపాన నిషేదమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి నాసిరకం మద్యం విక్రయిస్తూ ప్రజలను అనారోగ్యానికి గురి చేస్తున్నారని అన్నారు. డీఎస్సీ కావాలని నిరుద్యోగులు ధర్నాలు చేస్తే మరుసటి రోజే మెగా డీఎస్సీ స్టిక్కర్ ఉన్న మద్యం సీసాలు బయటకు వచ్చాయన్నారు. వైఎస్ షర్మిలపై అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవడంలో జగన్ విఫలమయ్యారని అన్నారు. సిద్ధం అంటూ ఎన్నికల ప్రచారం మొదలు పెట్టిన జగన్‌మోహన్‌రెడ్డి.. కబ్జాలు చేయడానికా?, ప్రజలను దోచుకోవడానికా?, అక్రమ మైనింగ్ చేయడానికా? దేనికి సిద్ధమో ప్రజలకు చెప్పాలని బైరెడ్డి శబరి డిమాండ్ చేశారు. వైసీపీ పాలనలో అరాచకాలు, దౌర్జన్యాలు తప్పా అభివృద్ధి జరగలేదని అన్నారు. పాణ్యం నియోజకవర్గం కబ్జాలకు కేరాఫ్‌గా మారిందని అన్నారు. దేవాలయాల మాణ్యాలు, వక్ఫ్‌బోర్డులు సైతం కబ్జా చేస్తున్నారని, అక్రమ మైనింగ్ చేస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే వెలగమాను డ్యామ్ గుర్తుకొస్తుందని, ఎన్నికలు పూర్తయితే వెలగమాను డ్యామ్‌ను పట్టించుకునే నాథుడే లేరని అన్నారు. అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులు చేయడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. సాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగ భూపాల్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, పాణ్యం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'రైతులపై దాడులు హేయం'


రాస్తారోకో చేస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు

నందికొట్కూరు ఫిబ్రవరి 22: పంజాబ్ రైతులపై హర్యానా పోలీసులు దాడులు చేయడం హేయమని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు అన్నారు. పంజాబ్, హర్యానా సరిహద్దులో హర్యానా పోలీసులు రైతులపై జరిపిన కాల్పులను నిరసిస్తూ అఖిలభారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం నందికొట్కూరు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా పటేల్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం పటేల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. నరసింహులు మాట్లాడుతూ వ్యవసాయాన్ని కార్పొరేటీకరించడానికి ప్రధాని మోదీ తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాలంటూ పంజాబ్ రైతులు చేపట్టిన చల్లో ఢిల్లీ కార్యక్రమంలో రైతులపై హర్యానా పోలీసులు చేస్తున్న దాడులు చేయడం దారుణమన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోపాల్, ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేఖర్ నాయుడు, ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ సభ్యులు పుల్లన్న, ఆర్.శివ పాల్గొన్నారు.

పశువులకు నట్టల నివారణ మందుల పంపిణీ


ఎర్రగుడూరులో పశువైద్య శిబిరం ఏర్పాటు చేసిన దృశ్యం

పాములపాడు, ఫిబ్రవరి 22: మండలంలోని ఎర్రగుడూరు గ్రామాంలో పీఎస్ఎస్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ సెక్రటరీ డాక్టర్ బత్తుల సంజీవరాయుడు సహకారంతో పశువులకు ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గురువారం పశు వైద్యాధికారి భాస్కర్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, గోపాలమిత్ర భాస్కర్ దూడలకు నట్టల నివారణ మందులు, ఎదకు రాని పశువులకు మాత్రలు, ఎద్దులకు ఆకలి పెరిగేందుకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే ఏపీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సేఫ్టీ ఆఫ్ మిల్క్ స్టాండర్డ్స్‌పై పాడి రైతులకు అవగాహన కల్పించారు.

'జొన్న కొనుగోలుకు చర్యలు'


వెలుగోడులో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

వెలుగోడు, ఫిబ్రవరి 22: మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా జొన్న కొనుగోలు కోసం కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి పవన్ తెలిపారు. గురువారం వెలుగోడు పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యలయంలో మండల రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రబీకి సంబంధించి మండలంలోని వేల్పనూరు, రేగడగూడూరు గ్రామాలలో 1450 ఎకరాలు జొన్న పంటను సాగు చేశారని చెప్పారు. క్వింటం ధర రూ.3180కు ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తామని తెలిపారు. హమాలీ, రవాణ ఖర్చులు మాత్రమే ప్రభుత్వం భరిస్తుందని, ఎఫ్ఎక్యూ నిబంధనలకు లోబడి కొనుగోలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో సుధారాణి, సిబ్బంది లక్ష్మిప్రసన్న పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి



డోన్‌లో సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 22: డోన్ నియోజకవర్గం లోని పలు గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్ డిమాండ్ చేశారు. ఈ డోన్ ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం లోని సీనియర్ అసిస్టెంట్ సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. వడ్డె మహారాజ్ మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలోని కొత్తబురుజు, ఉమ్మెమర్రి, ఉప్పలపల్లి, రాచర్ల, తదితర గ్రా మాల్లో ప్రజలు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారని అన్నారు. సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్మీరామయ్య, ఆర్కే రెడ్డి, ఉమాజీ రావు తదితరులు పాల్గొన్నారు

సేవతోనే గుర్తింపు

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 22: ప్రజలకు మంచి సేవలందించడం వల్లనే గుర్తింపు లభిస్తుందని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి తెలిపారు. వలంటీర్లకు పురస్కారాల్లో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రతిభ కనబరిచిన వలంటీర్లను వారు సన్మానించారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనరు బుడ్డ చంద్రమోహన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ మేకల ఓబులేసు, మండల వైసీపీ నాయకులు శివరామక్రిష్ణరెడ్డి, దేశం సోమశేఖర్‌రెడ్డి, కొర్ర ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో రఘురాం, జడ్పీటీసీ పుణ్యమ్మ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

చాగలమర్రి, ఫిబ్రవరి 22: చాగలమర్రి గ్రామంలోని బాలికోన్నత పాఠశాలను గురువారం ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. ప్రధానమంత్రి విద్యా అభివృద్ధి యోజన పథకం కింద పాఠశాల ఎంపికైనట్లు ఎంఈవోలు పేర్కొన్నారు. పాఠశాలలోగల మౌలిక వసతులను, క్రీడా మైదానం పనులు, తాగునీరు, మరుగుదొడ్లు, భవనాలను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు దాక నిధులు మంజూరవుతాయన్నారు. ఆ నిధులతో పాఠశాల అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, సీఆర్పీ అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

13 వేల మంది రైతులకు పంట నమోదు

చాగలమర్రి, ఫిబ్రవరి 22: మండలంలో 13 వేల మంది రైతులకు పంట నమోదు చేశామని ఏవో రంగసేతాజీ తెలిపారు. గురువారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో వ్యవసాయ సిబ్బంది చేస్తున్న ఈక్రాప్ నమోదును పరిశీలించారు. సూపర్‌చెక్‌లో భాగంగా రైతుల పంట నమోదు వివరాలు పరిశీలించారు. ఇప్పటి వరకు 13,569 మంది రైతులు పంట నమోదు పూర్తి చేశారని అన్నారు. 3,555 మంది రైతులు మాత్రమే ఈకేవైసీ పూర్తి చేసుకున్నారని, ఇంకా 120 మంది రైతులు పూర్తి చేసుకోవాల్సి ఉందని అన్నారు. 23వ తేదీ లోపు రైతులు ఈక్రాప్, ఈకేవైసీ చేయించుకోకపోతే ప్రభుత్వ సాయం అందదని అన్నారు. కార్యక్రమంలో వీఏఏ నవీన్‌కుమార్, వీహెచ్‌ఏ ఉషారాణి పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి



గొడిగనూరులో గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

చాగలమర్రి, ఫిబ్రవరి 22: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి ఉంచినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ సూచించారు. గురువారం చాగలమర్రి పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం గొడిగనూరు, ముత్యాలపాడు, చిన్నవంగలి, పెద్దవంగలి గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సమస్యాత్మక గ్రామమైన గొడిగనూరు గ్రామంలో గ్రామస్థులతో చర్చించారు. డీఎస్పీ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 34 సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయని అన్నారు. ఎన్నికలకు ముందుగానే ఆయా గ్రామాల్లో రౌడీషీటర్లను, అనుమానితులను బైండోవర్ చేస్తామని అన్నారు. ఏవైన సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తెవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమణయ్య ఉన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి

శిరివెళ్ల, ఫిబ్రవరి 22 : 0-5 సంవత్సరాల లోపు చిన్నారులకు మార్చి 3న తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వైద్యురాలు దివ్య సూచించారు. శిరివెళ్లలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి పల్స్ పోలియో శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని 3,535 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు 21 బూత్‌లు, 42 టీంలుగా విభజించి 91 మంది సిబ్బందిని నియమించామన్నారు. పోలియో నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ రవి కిషోర్, పీహెచ్‌ఎన్ సరస్వతి, అమినాబీ పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభానికి పసుపు రాసి పూజలు చేస్తున్న మహిళలు

శిరివెళ్ల, ఫిబ్రవరి 22 : శిరివెళ్లలో జీర్ణోద్ధరణ చేయబడిన అన్నపూర్ణా విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర-బసవేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ వేడుకలను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేదపండితులు వేకువజామునే శాస్త్రోక్తంగా గోపూజ, ప్రతిష్ఠామూర్తులు, యంత్రాలకు సంస్కారాలు, విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ, పూర్ణాహుతి నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ధ్వజస్తంభానికి, దేవతామూర్తులకు విశేష పూజలు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు, జనసేన శిరివెళ్ల మండల ఇన్‌చార్జి ఇరిగెల ప్రతాప్‌రెడ్డి, పలువురు టీడీపీ, జనసేన నాయకులు ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠకు హాజరైన అశేష భక్తులకు నిర్వాహకులు అన్నదాన వసతి కల్పించారు.

భక్తి శ్రద్ధలతో గోపూజ

చాగలమర్రి, ఫిబ్రవరి 22: చాగలమర్రిలోని పాత శివాలయంలో గురువారం వేద పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో మాఘమాసం, పౌర్ణమి పురస్కరించుకొని శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు సామూహికంగా పార్వతిదేవికి వడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులతో పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా

● మాజీ మంత్రి అఖిలప్రియ



ఆళ్లగడ్డలో మహిళతో మాట్లాడుతున్న మాజీ మంత్రి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 22: వైసీపీ ప్రభుత్వ అసమర్థ విధానాలతో రాష్ట్రం దివాలా తీసిందని మాజీ మంత్రి అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఆశ్రమవీధిలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ పాలన దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమీ లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని మాఫియాలకు అడ్డాగా మార్చేసి భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉండేవన్నారు. సైకో పాలనలో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందంటే వైసీపీ పాలన ఎంత దారుణంగా ఉందో ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సీఎం జగన్ చేసింది శూన్యమన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హుసేన్‌బాషా, సోముల భాస్కరరెడ్డి, మాజీ కౌన్సిలర్ నరసింహులు, బాస్కర్, శివ టీడీపీ మహిళా కార్యకర్తలు అట్ల శ్రీదేవి, నూర్జహాన్, రమిజా, సుబహాని, పూజిత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వస్తేనే ఉజ్వల భవిష్యత్తు



కొచ్చెర్వులో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సుబ్బారెడ్డి

డోన్, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో మళ్లీ టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వస్తేనే ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ అసమర్థ పాలనతో రాష్ట్ర ప్రజల భవిష్యత్తు అంధకారంగా మారిందని ధ్వజమెత్తారు. కూల్చివేతలు, విధ్వంసాలు తప్ప ప్రజలకు జరిగిన అభివృద్ధి ఏమీ లేదని మండిపడ్డారు. చంద్రబాబు అహర్నిశలు శ్రమించి రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకువస్తే వాటిని తరిమేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. నిరుద్యోగ యువత రోడ్డున పడి ధర్నాలు చేస్తున్నా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా అన్యాయమన్నారు. టీడీపీ-జనసేన కూటమిని రాబోయే ఎన్నికల్లో గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, అబిరెడ్డిపల్లె గోవిందు, మధుసూదన్ రెడ్డి, మిద్దెపల్లి గోవిందు, కొచ్చెర్వు రామాంజనేయులు, గుల్షన్, మెట్ట మద్దయ్య, చింతలపేట వెంకట్రాముడు, చిన్నకాంతు, మురళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న వైసీపీ

పత్రికా, మీడియా స్వేచ్ఛను హరిస్తూ వైసీపీ ప్రభుత్వం దాడులకు పాల్పడటం సిగ్గు చేటు అని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ అనంతపురంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై, మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌లపై వైసీపీ నాయకులు బరితెగించి దాడులకు పాల్పడి భయభ్రాంతులకు గురి చేయడం ప్రజాస్వామ్యాన్ని కూని చేయడమేనన్నారు. సీఎం జగన్ ప్రోద్బలంతోనే వైసీపీ నాయకులు దాడులకు చెలరేగిపోతున్నారనీ మండిపడ్డారు. మరోసారి తిరిగి అధికారంలోకి వచ్చేందుకు వైసీపీ ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం దాడులకు తెగబడుతోందని ధ్వజమెత్తారు. వైసీపీ నాయకుల దాడులను అడ్డుకోవడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు. పత్రిక, మీడియా స్వేచ్ఛను హరించడం ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించేలా వైసీపీ చర్యలు ఉండటం చాలా దారుణమన్నారు. వైసీపీ తాటాకు చప్పులకు భయపడే ప్రసక్తే లేదని సుబ్బారెడ్డి హెచ్చరించారు.

వృద్ధుల పోస్టల్ బ్యాలెట్‌ను గుర్తించండి: ఆర్డీవో



రుద్రవరంలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లికార్జునరెడ్డి

రుద్రవరం, ఫిబ్రవరి 22 : వృద్ధుల పోస్టల్ బ్యాలెట్‌ను గుర్తించాలని అధికారులకు నంద్యాల ఆర్డీవో మల్లికార్జునరెడ్డి సూచించారు. గురువారం రుద్రవరంలోని తహసీల్దారు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో బూత్‌లెవల్ ఆఫీసర్లు, సెక్టోరియల్ ఆఫీసర్లు ఎంసీసీ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై పరిశీలించి గుర్తించి వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆళ్లగడ్డ నియజకవర్గంలో 2,30,914 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో మహిళలు 1,16,589 మంది, పురుషులు 1,14,325 మంది ఉన్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న ఓటర్ల జాబితా వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 295 పోలింగ్ కేంద్రాలు 170 ప్రాంతాల్లో ఉన్నాయన్నారు. ఎన్నికల కమిషన్ మొదటిసారిగా 80 ఏళ్ల పైబడి వృద్ధుల ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్‌గా గుర్తించాలని సూచించిందని, ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు మురళీమోహన్, ఎంపీడీవో రామచంద్ర, డిప్యూటీ తహసీల్దారు రవీంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

డోన్(రూరల్), ఫిబ్రవరి 22: విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12 (1)సి ప్రకారం 2024-25 విద్యాసంవత్సరానికి గాను ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న పిల్లల (అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల పిల్లలు) కోసం సంరక్షకులు, తల్లిదండ్రులు తమ నివాస సమీప ప్రాంతాల్లో ఐబీ/సీబీఎస్ఈ/ ఐసీఎస్ఈ/స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాధికారి ప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ నెంబరు ద్వారా ప్రాథమిక వివరాలతో Http//cse.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. టోల్‌ఫ్రీ నెంబర్.18004258599 ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు.

1550 మందికి సంపూర్ణ భూ హక్కు పత్రాలు

● మంత్రి బుగ్గన



పట్టా అందజేస్తున్న మంత్రి

బేతంచెర్ల, ఫిబ్రవరి 22: కులాలకు, మతాలకు అతీతంగా బేతంచెర్లలో ఐదేళ్ల కాలంలో 1550 మందికి 2300 ఎకరాల సంపూర్ణ భూహక్కు పత్రాలు అందించామని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. భూమిలేని నిరుపేదలకు డి-పట్టాభూమి ఎకరాకు రూ.10 లక్షలు చొప్పున వేసుకున్నా 1550 కుటుంబాలకు రూ.230 కోట్లు విలువైన భూమి పంపిణీ చేశామన్నారు. అలాగే పట్టణ శివారులోని కొలుములపల్లె రస్తాలో రూ.60 లక్షలతో నిర్మించిన కూరగాయల మార్కెట్ యార్డును మంత్రి బుగ్గన గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, మద్దిలేటి స్వామి ట్రస్టు బోర్డు చైర్మన్ రామచంద్రుడు, గిడ్డంగుల కార్పొరేషన్ డైరెక్టర్ బాబుల్ రెడ్డి పాల్గొన్నారు.

ప్యాపిలి: అర్హులైన పేదలందరికీ భూపట్టాలు పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని షాదీఖానాలో 293 మంది పేదలకు ఆయన భూపట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, నాయకులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, రాజా నారాయణమూర్తి, గడ్డం భువనేశ్వరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పార్వేట ఉత్సవ పల్లకీ వేడుకకు

సర్పంచ్‌కు అందని ఆహ్వానం

రుద్రవరం, ఫిబ్రవరి 22 : మండలంలోని నాగులవరం గ్రామానికి చెందిన సర్పంచ్ గంధం సావిత్రమ్మ అటు రెవెన్యూ అధికారులు ఇటు అహోబిళం దేవస్థాన అధికారులపై గురువారం రాత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంప్రదాయకంగా సర్పంచ్‌కు పార్వేట పల్లకీకి స్వాగతం పలికేందుకు ఆహ్వానం అందించాలి కదా, ఈ సారి ఎందుకు ఆహ్వానం, ఇవ్వలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కావాలనే తనను అవమానించారని ఆరోపించారు.

లైబ్రేరియన్‌కు స్టడీ మెటీరియల్ అందజేత



కోవెలకుంట్ల, ఫిబ్రవరి 22 : పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగుల కోసం స్టడీ మెటీరియల్స్‌ను కోవెలకుంట్ల లైబ్రేరియన్‌కు 1999 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు గురువారం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుబ్బారెడ్డి, తిరుపం రెడ్డి, ఫణి , రజాక్, శ్యామ్ బాబు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ఘన నివాళి



ఉయ్యాలవాడలో ర్యాలీ చేస్తున్న అపుస్మా నాయకులు, విద్యార్థులు



డోన్‌లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 22 : తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి గురువారం ఘన నివాళులర్పించారు. నరసింహారెడ్డి 177వ వర్ధంతి సందర్భంగా ఉయ్యాలవాడ ప్రధాన రహదారి నుండి బస్టాండు ఆవరణ వరకు అపుస్మా డివిజన్ అధ్యక్షుడు అమీర్ బాషా, బీసీఎస్ఆర్ పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండు ఆవరణలో ఉన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అపుస్మా ఆళ్లగడ్డ యూనిట్ కోశాధికారి సుబ్రహ్మణ్యం, బీసీఎస్ఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని బుడ్డా పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): మొదటి స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 117వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని రెడ్డి భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రిటీష్ పాలనలో స్వాతంత్రం కోసం నరసింహారెడ్డి చేసిన పోరాటాలను గుర్తు చేస్తూ వివరించారు. కార్యక్రమంలో హనుమంతరెడ్డి, దారా ప్రతాప్ రెడ్డి, నందురెడ్డి, మల్లికార్జున రెడ్డి దారా హరినాథ్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవలు చిరస్మరణీయం అని రిటైర్డ్ గ్రంథాలయ అధికారి పల్లె నరసింహారెడ్డి ,బీజేపీ రాష్ట్ర నాయకులు లింగన్న పేర్కొన్నారు. గురువారం కోవెలకుంట్లలోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం నాయకుడు కరీంభాషా, కామిని వేణుగోపాల్ రెడ్డి బీజేపీ నాయకులు సుబ్బయ్య సుబ్బారెడ్డి మల్లికార్జున,ఓబీసీ మోర్చా, రాష్ట్ర కో ట్రెజర్ మందుల సీతరామయ్య షేక్ చాందిని, బాలవద్ది రాజు, ప్రచార సుబ్బయ్య , రాముడు, గుర్రంబండి బాషా పాల్గొన్నారు.



కోవెలకుంట్లలో నివాళి..

శిరివెళ్ల: తెల్లదొరల నిరంకుశ పాలనపై తిరుగుబాటు చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177వ వర్ధంతిని మండలంలోని యర్రగుంట్ల టీడీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. రేనాటి సూర్యుడు నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం లక్ష్మీరెడ్డి, కమతం పుల్లారెడ్డి, శీలం రామ్మోహన్, తపసి పుల్లయ్య, తాళ్లూరి బుగ్గన్న, వెంకటేశ్వర్లు, మండ్ల హుసేనప్ప తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

చాగలమర్రి, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని, రాక్షస పాలనకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ వార్డు ఇన్‌చార్జి నాగూర్‌వలి అన్నారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని గుంతపాలెం వీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. ఆళ్లగడ్డలో టీడీపీ జెండా ఎగురవేయడం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

దస్తగిరి స్వామికి ఫతేహాలు



దస్తగిరి స్వామి దర్గాలో ఫతేహాలు సమర్పిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె , ఫిబ్రవరి 22: బనగానపల్లె పట్టణంలోని దస్తగిరిస్వామి దర్గా వద్ద మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, దస్తగిరిస్వామి దర్గా పీఠాధిపతి ఖాజీ సయ్యద్‌ముష్తిఅబ్దాల్ సాహెబ్‌లతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురువారం బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ 25 రోజుల పాటు పీఠాధిపతి దైవ ప్రార్థన నిమిత్తం ఉమ్రా, మక్కా, బాగ్దాద్‌కు వెళ్తున్నట్లు తెలిపారు. ఆయన పర్యటన విజయవంత కావాలని ఆకాంక్షించారు. దర్గా వద్ద పీఠాధిపతిని సత్కరించి ప్రత్యేక ఫతేహాలు సమర్పించారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

బనగానపల్లె, ఫిబ్రవరి 22: బనగానపల్లె నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల మండలంలోని బెలుం, తిమ్మనాయునిపేట గ్రామాల్లో దాడులు నిర్వహించి నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు బనగానపల్లె సెబ్ సీఐ జోగేంద్ర గురువారం తెలిపారు. బెలుంలో తోట నాగార్జున, సీకిరి హుసేని అను వారి వద్ద 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తిమ్మనాయునిపేటలో గాజుల హుసేని అను వ్యక్తి వద్ద 80 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. అలాగే బనగానపల్లె సెబ్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడి బనగానపల్లె సెబ్ స్టేషన్‌లో 48 సారా కేసుల్లో పట్టుబడ్డ 835 లీటర్ల నాటుసారా, 20 లీటర్ల మద్యాన్ని ఎస్పార్బీసీ కాల్వ వద్ద ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పోతులయ్య సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో కొత్త బ్రేకర్ ఏర్పాటు

రుద్రవరం, ఫిబ్రవరి 22 : మండలంలోని యల్లావత్తుల గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రూ.10 లక్షలతో కొత్త బ్రేకర్‌ను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ డీఈ రమణారెడ్డి, డిప్యూటీ డీఈ రవికాంత్ చౌదరి, ఏఈ రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్‌ను ప్రారంభించారు. ఈ బ్రేకర్ ఏర్పాటు చేయడంతో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించే సౌకర్యం ఉందన్నారు. ఏదైనాసమస్యలుంటే ఏఈ దృష్టికి తేవాలని రైతులకు సూచించారు.

వైభవంగా వన్నూరుషా ఉరుసు

బేతంచెర్ల, ఫిబ్రవరి 22: మండలంలోని కొలుములపల్లె గ్రామంలో వెలసిన వన్నూరుషా ఉరుసు ఉత్సవాలు అత్యంత వైభవంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చిన్న వన్నూరుషా ఇంటి నుంచి గంధం దర్గాకు ఊరేగింపుగా చేరుకున్నారు. గ్రామ ప్రజలు భక్తులు వన్నూరుషాకు ఫతేహాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల కొలుములపల్లె బలపాలపల్లె ముద్దవరం తదితర గ్రామాల నుంచి ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

భక్తుల చెంతకే నారసింహుడు

రుద్రవరం, ఫిబ్రవరి 22 : అహోబిళం పుణ్యక్షేత్రం నుంచి ప్రారంభించిన పార్వేట ఉత్సవ పల్లకీలో భక్తుల వద్దకే నారసింహుడు. గురువారంమండలంలోని టి.లింగందిన్నె గ్రామంలో ప్రత్యేక పూజలందుకున్నారు. ఉత్సవ పల్లకీలో కొలువుదీరిన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరదస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో పండుగ సందడి నెలకొంది. గురువారం రాత్రి ఉత్సవ పల్లకీ ఆర్.నాగులవరం గ్రామానికి చేరుకుంది.

చెంచు గూడెంలో వైద్యశిబిరం

రుద్రవరం, ఫిబ్రవరి 22 : మండలంలోని చిన్నయ్యస్వామి చెంచుగూడెం, కె.కొత్తూరు గ్రామాల్లో 104 ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించినట్లు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు వసుంధర తెలిపారు. గురువారం రెండు గ్రామాల్లో వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశామని తెలిపారు. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్ద ని సూచించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం తిరుమలేశ్వరి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించండి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 22: వేసవి ప్రారంభ కాకముందే ఆళ్లగడ్డ మున్సిపాల్టిలో తాగునీటి ఎద్దడి ప్రారంభమైందని బీజేపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరినా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రజల కోసం నంద్యాల కలెక్టరును వినతి పత్రం ద్వారా కోరనున్నట్లు ఆయన చెప్పారు. పట్టణంలో శుక్రవారం నుంచి చేపట్టనున్న ప్రజా శంఖారావం కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 22: మండలంలోని భీమునిపాడులో మద్యం సీసాలు అమ్ముతున్న హుసేని అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ గురువారం తెలిపారు. హుసేని అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కొలిమిగుండ్ల: తుమ్మలపెంట గ్రామానికి చెందిన సాకే ఆదెప్ప అను వ్యక్తి గ్రామంలో అక్రమ మద్యం విక్రయిస్తుండగా అతన్ని అరెస్టు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు. అతని వద్ద 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సంజామల ఫిబ్రవరి 22 : మండల ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ బంధువులు, స్నేహితుల పేర్లతో ఫోన్‌లు చేస్తారని, అలాంటి వాటిపై బంధువులు, స్నేహితులతో మాట్లాడి నిర్ధారణ చేసుకోవాలన్నారు. క్యూఆర్ కోడ్ మనం పేమెంట్ చేయడానికి వినియోగిస్తామన్నారు. సైబర్ నేరగాళ్లు క్యూఆర్ కోడ్ పంపిస్తాం. డబ్బులు పంపమని ఫోన్‌కాల్ చేస్తారని అది ఖచ్చితంగా మోసమన్నారు. అపరచితులతో చాట్ చేసేటప్పుడు పేరు, ఖాతానంబరు, పాన్, ఏటీఎం కార్డులాంటి వ్యక్తిగత సమాచారాన్ని చాట్ చేయవద్దన్నారు. ఆన్‌లైన్ మోసాలు, బ్యాంకులు, భీమా కంపెనీలు ఈమెయిల్ ద్వారా గాని మీపేరు, అకౌంట్ల నంబర్లు అడిగితే ఇవ్వరాదన్నారు. వలంటీర్ల పేరుతో నేరగాళ్లు మోసాలు చేస్తున్నారని, ఉచిత గిఫ్టులు, ఆన్‌లైన్‌లో జూదం, సోషల్ మీడియాలో కొత్తపరిచయాలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు సైబర్ నేరాలకు గురైతే 1930 నంబరుకు కాల్ చేసి తక్షణ సాయం పొందాలని కోరారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే ఖబడ్దార్

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 22: గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రేవనూరు ఎస్ఐ రాంమోహన్ రెడ్డి అన్నారు. గురువారం రేవనూరు పోలీష్ స్టేషన్ పరిధిలోని పెద్ద కొప్పెర్ల గ్రామంలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. ప్రజలు ఎన్నికలకు సహకరించాలని కోరారు.